క్లుప్తంగా

నేత్రదానంతో ఇద్దరికి వెలుగు

తెనాలి: ఒకరి నేత్రదానం ఇద్దరి జీవితాలకు వెలుగునిస్తుందని, ప్రతిఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగి అంధత్వ నివారణకు తమ వంతు కృషిచేయాలని చెన్నైకు చెందిన డాక్టర్ అగర్వాల్స్ ఐ బ్యాంక్ జనరల్ మేనేజర్ రాజీవ్ కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన సామాజిక సేవాసంస్థ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సదస్సు సోమవారం స్థానిక బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో జరిగింది. నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అధ్యక్షత వహించారు.

కృష్ణ బలిజ సంఘం కోశాధికారిగా పిన్నారావు

తెనాలిటౌన్: రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం కోశాధికారిగా తెనాలికి చెందిన అన్నం పిన్నారావు ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. పిన్నారావుకు రాష్ట్ర నాయకులు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణబలిజ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు తెనాలికి చెందిన పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కాల్వలు నిర్మించండి

తెనాలిఅర్బన్: 3వ వార్డు సిద్ధార్థ కాలనీలో మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామని వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు ప్రజల నుంచి వినతిపత్రాలు సేకరించారు. అన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా వేళాంగిణి మాత జన్మదినోత్సవం

తెనాలిరూరల్: వేళాంగిణి మేరీ మాత జన్మదినోత్సవాన్ని మండలంలోని అంగలకుదురులో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రా మంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద వితంతువులు, పేదలకు బియ్యం, కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. చర్చి గురువులు నాగోతు శౌరిరాజు, ఇమ్మానియేల్, విన్సెంట్, సునీల్, జయాల్, ముక్తి సిస్టర్స్, హోలీ క్రాస్ సిస్టర్స్, ఉపదేశకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

పెళ్లి చేయాలంటూ టవర్ ఎక్కి.. హల్‌చల్

తెనాలిరూరల్: మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కి ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాండురంగ పేటకు చెందిన అశోక్ గతంలో బొబ్బిలి ప్రాంతం నుంచి తెనాలి వచ్చి తాపీ పనులకు వెళుతుంటాడు. ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ, సహజీవనం చేస్తున్నాడు. స్థానికంగా మరో బాలికను ప్రే మించానని ఆమెతో పెళ్లి చేయాలని కోరుతూ సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో సెల్ టవర్ ఎక్కి నానా హడావిడి చేశాడు. మద్యం మత్తులో ఉన్న అశోక్ ఎంత మంది నచ్చజెప్పినా ఒంటిగంట వరకు టవర్ దిగలేదు. చివరికి త్రీ టౌన్ పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో టవర్ దిగివచ్చిన అశోక్ కు స్థానికులు దేహశుద్ధి చేశారు. పోలీసులు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ తరలించి, విచారణ చేపట్టారు.

కిట్లు వైద్యశాలకు రావాలి

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో హెచ్ఐవీ కిట్ల కొరత ఉందని వాటిని ప్రభుత్వం పంపిచేలా చర్యలు తీసుకోవాలని రాజీవ్ యువసేన సేవా సంఘం అధ్యక్షుడు వి.సూరిబాబు ఒక ప్రకటనలో కోరారు. 1982వ సంవత్సరం నుంచి స్వచ్ఛంద సంస్థ ద్వారా హెచ్ఐవీ రోగులకు సేవ లందిస్తున్నట్లు చెప్పారు. కొందరూ ఉద్యోగులు కావాలని కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణిని వివరణ కోరగా తెనాలి జిల్లా వైద్యశాలలో సంఘటన నెలకు ఐసీపీసీటీ పరీక్షలు 1500, పీపీటీసీ పరీక్షలు 700 వరకు చేస్తున్నట్లు చెప్పారు.

ఫిజియో థెరపీ దినోత్సవం

తెనాలి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో సోమవారం ప్రపంచ ఫిజియో థెరపీ దినోత్సవం జరిగింది. ది తెనాలి ఫిజియో థెరపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కంభం వెంకటకుమార్ మాట్లాడారు. ప్రతి సంవత్సరం సెప్టెంబరు ఎనిమిదో తేదీన ప్రపంచ ఫిజియో థెరపీ దినోత్సవం జరుపుకుంటున్నట్టు చెప్పారు. ఫిజియోథెరపీ వృద్ధులకు చాలా బాగా దగ్గరవుతుందని అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ కె.చంద్రశేఖర్ పర్యవేక్షించారు. డాక్టర్ సందీప్, డాక్టర్ చిత్ర, డాక్టర్ విష్ణుప్రియ, డాక్టర్ దీప్తి, డాక్టర్ చందన, డాక్టర్ డేవిడ్ పాల్గొన్నారు.

నేడు తెనాలిలో ‘అన్నదాత పోరు’

ఏ-1 కన్వెన్షను హాలు నుంచి నిరసన ప్రదర్శన


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వెంకటప్పారెడ్డి

తెనాలి: ఖరీఫ్ సీజనులో వరి సాగుకు అవసరమైన యూరియా కోసం రైతులు పడుతున్న అగచాట్లకు నిరసనగా, అన్నదాతలకు కావాల్సిన ఎరువులను ప్రభుత్వం పంపిణీ చేయాలనే డిమాండ్‌తో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ‘అన్నదాతల పోరు’ జరగనుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ప్రకారం రైతులకు అండగా నిలిచేందుకని అన్నదాత పోరు నిరసన ప్రదర్శనను నిర్వహించనున్నారు. పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉదయం 10 గంటలకు రామలింగేశ్వరపేటలోని ఏ-1 కన్వెన్షను హాలు వద్ద నుండి ప్రదర్శనగా బయలుదేరతారు. నేరుగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ సబ్‌కలెక్టర్‌ను కలిసి యూరియా కోసం రైతులు ఎదుర్కొంటున్న అవస్థలను వివరించి, సరిపడినంతగా యూరియాను సరఫరా చేయించాలని కోరుతూ వినతిపత్రం ఇస్తారు. ఈ కార్యక్రమంలో భారీసంఖ్యలో రైతులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని పార్టీ నియోజకవర్గ కార్యాలయం బాధ్యులు కోరారు.

అన్నదాత పోరు కార్యక్రమానికి తరలిరండి

కొల్లిపర: నేడు తెనాలిలో రామలింగేశ్వర పేటలోని ఎ-1 కన్వెన్షన్ హాల్ వద్ద నుంచి పాదయాత్ర ద్వారా ఆర్డీవో కార్యాలయం వద్ద వరకు ర్యాలీ ద్వారా వెళ్లి వినతిపత్రం అందించే కార్యక్రమానికి కొల్లిపర మండలం నుంచి అధిక సంఖ్యలో రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షులు కళ్ళం వెంకటప్పారెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలోని ప్రధాన కూడలిలోని పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్లను మండల స్థాయిలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

యూరియా కొరత లేదంటూ క్యాబినెట్ మంత్రులు, జిల్లా కలెక్టర్లు చేస్తున్న ప్రకటనలకు వాస్తవానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. యూరియా, డీఏపీ కోసం జిల్లా, నియోజకవర్గం, మండలాలు అనే తేడా లేకుండా రైతులు క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతన్నలు ఈనాడు ఎరువులు కోసం ఇలాంటి కష్టాలు చూస్తుంటే కన్నీళ్లు ఆగటం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మాత్రం లోడ్లకు లోడ్లు యూరియా వస్తున్నాయని ప్రకటిస్తున్నారనీ, మరి అవి ఎక్కడికెళుతున్నాయో కూటమి సర్కారే సమాధానం చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంతన నేడు ఉదయం 9 గంటలకు తెనాలిలోని రామలింగేశ్వర పేటలోని ఏర్పాటు చేసిన ర్యాలీ కార్యక్రమానికి ఎ-1 కన్వెన్షన్ హాల్ వద్దకు అధిక సంఖ్యలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తాం

తెనాలిటౌన్: కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. నెస్లే ఇండియా లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పట్టణంలోని మూడు మున్సిపల్ హైస్కూళ్లలో రూ.21 లక్షలతో నిర్మించిన బయో టాయ్‌లెట్లను సోమవారం మంత్రి ప్రారంభించారు. కొత్తపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరు, చెంచుపేటలోని కేపీఎస్ మునిపల్ ఉన్నత పాఠశాలలో మూడు, గంగానమ్మపేటలోని టీఎస్సార్ మున్సిపల్ హైస్కూల్లో నిర్మించిన రెండు టాయ్‌లెట్లను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం పూట అక్షయపాత్రచే అందిస్తున్న భోజనం మెనూలో మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. రైతులు పండించిన పంటలో 3 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం పథకానికి వినియోగిస్తున్నామని తెలిపారు. పిల్లలకు తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులకు గురువులే మార్గదర్శకులని చెప్పారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా చూస్తూ మంచి మార్గంవైపు


బయో టాయ్‌లెట్లను పిల్లలచే ప్రారంభింపజేస్తున్న మంత్రి మనోహర్

వారిని నడిపించటానికి కృషిచేయాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మున్సిపల్ హైస్కూళ్లలో విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తున్నారని, ఉపాధ్యాయులే ఇందుకు ప్రధాన కారణమన్నారు. మరింత శ్రద్ధగా వారిని తీర్చిదిద్దాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కూడా మరింతగా మెరుగుపరుస్తామని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారులు డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, వి.జయంత్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు టి.రాఘవయ్య, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవంతో విధులు నిర్వహించేలా చూడాలి

కొల్లిపర: ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయంలో నియమించబడ్డ ఉద్యోగులు విధినిర్వహణలో ఆత్మగౌరవంతో విధులు నిర్వహించే విధంగా చూడాలని, గతంలో వలంటీర్లు పనిచేసే క్లస్టర్లను సచివాలయ సిబ్బందికి బదలాయించి, క్లస్టర్లలో సచివాలయం ఉద్యోగులు చేత పని చేయించుకోవడం విధానాన్ని వెనకకు తీసుకోవాలని డెమొక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బండికళ్ళ సతీష్ కోరారు.సోమవారం స్థానిక మండల పరిషత్, రెవిన్యూ కార్యాలయంలో సచివాలయం ఉద్యోగులకు ప్రభుత్వం అదనంగా కేటాయించిన విధులు గురించి, సమస్యలపై తహసీల్దారు జి.సిద్దార్థ, ఎంపీడీవో విజయలక్ష్మిలకు వినతపత్రం అందజేశారు. సతీష్ మాట్లాడుతూ వివిధ రకాల సర్వేల వలన ఉద్యోగులు సచివాలయం కేంద్రంగా విధులు నిర్వర్తించడానికి, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించడానికి ఇబ్బందికరంగా ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దీనరాజు, డాక్టర్ రాజేష్ నాయుడు, పనేంద్ర, ప్రదీప్, అరుణ్‌బాబు, భరత్, కారుమంచి సుబ్బా రావు, కె.ఉమామహేశ్వర రావు, శాంతి, హరిబాబు, మాధురి పాల్గొన్నారు.

ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికల పారదర్శక నిర్వహణకు వినతి

తెనాలి: ఏపీ ఎన్జీవో అసోసియేషన్, తెనాలి యూనిట్ ఎన్నికలను నాయబద్ధంగా జరిపించాలని కోరుతూ యూనిట్ సభ్యులు పలువురు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమావేశంలో సబ్‌కలెక్టర వి.సంజనా సింహకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత కార్యవర్గం కాలపరిమితి సెప్టెంబరు నెలతో పూర్తవుతుందని తెలిపారు. సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారంలో మొత్తం 15 అర్జీలు వచ్చాయి. రెవెన్యూకు సంబంధించి ఆరు అర్జీలు రాగా, వైద్యవిభాగం రెండు, పంచాయతీరాజ్ నాలుగు, పోలీస్‌శాఖకు ఒకటి, మున్సిపాలిటీకి సంబంధించిన రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. సంబంధిత శాఖలకు పంపి నిర్ణీత వ్యవధిలో పరిష్కారమయ్యేలా చూస్తామని సబ్‌కలెక్టర్ సంజనా సింహ చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

తెనాలి: సంగం డెయిరీ పాడి రైతులకు పలు సేవలను అందిస్తున్నట్టు డెయిరీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి పర్వతనేని అనిల్‌కుమార్ చెప్పారు. రూరల్ మండలం పెదరావూరులోని పాల ఉత్పత్తి కేంద్రంలో జరిగిన సోమవారం రైతులకు పాలధరల వ్యత్యాసం (బోనస్) పంపిణీ చేశారు. సంగం డెయిరీకి పాలుపోస్తున్న మొత్తం 212 పాల ఉత్పత్తిదారులకు రూ.3.49 లక్షలను బోనస్‌గా అందజేశారు. 3 లక్ష 49 వేల రూపాయలను బోనస్‌గా అందజేశారు. పాడి పశువుల పోషణలో రైతులకు అవసరమైన సూచనలు చేశారు. సెక్స్ సార్టెడ్ సెమెన్ వినియోగించటం ద్వారా ఆడ దూడలు మాత్రమే పుడతాయనీ, తద్వారా పాడి పెరుగుతుందని అన్నారు. సంగం డెయిరీకి పాలు పోస్తున్న పాల ఉత్పత్తిదారులకు డెయిరీ నుంచి అనేక సేవలు అందిస్తూ రైతుల ఆర్థిక అభివృద్ధికి దోహద పడుతున్నట్టు సీనియర్ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, డెయిరీ పాలకవర్గ సభ్యుడు శాఖమూరి వెంకటేశ్వరరావు, పాల ఉత్పత్తిదారులు కందేపి వెంకటేశ్వరరావు, పాలడుగు వెంకట కృష్ణారావు, ఆలూరి అంజయ్య, మాదల సాంబశివరావు, కొడాలి సుధాకర్ పాల్గొన్నారు.


బోనస్ పంపిణీ చేస్తున్న దృశ్యం

గుడివాడలో...

గుడివాడ గ్రామంలోని 99 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1.69 లక్షలను బోనస్‌గా పంపిణీ చేశారు. సోమవారం గుడివాడ సంఘ అధ్యక్షుడు బొద్దులూరి సుబ్బారావు, సంగం డెయిరీ మేనేజర్ బండ్లమూడి శ్రీకాంత్, కావూరి చంద్రమోహన్, గ్రామ సర్పంచ్ యడ్లపాటి రాకేష్, డెయిరీ అధికారులు, సంఘ పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి ఉద్యమ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఎంపీపీ చెన్నకేశవులు


మాట్లాడుతున్న ఎంపీపీ చెన్నకేశవులు, ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: మహిళల వ్యాపారాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమ రిజిస్ట్రేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డి.చెన్నకేశవులు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిధిలోని డ్వాక్రా మహిళలకు చిన్నతరహా వ్యాపారాభివృద్ధి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ చెన్నకేశవులు, ఎంపీడీవో అత్తోట దీప్తి పాల్గొని మాట్లాడారు. చిన్న, మధ్య తరహా వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యమ రిజిస్ట్రేషన్ చేసుకోవడం వలన సంబంధిత మెయిల్ ఐడీకి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు ఎప్పటికప్పుడు వస్తుంటాయని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. రెండున్నర కోట్ల నుంచి 125 కోట్ల వరకు వ్యాపారాభివృద్ధే లక్ష్యంగా ప్రోత్సాహకాలు ప్రభుత్వం ఇస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా 75 మంది మహిళలు ఉద్యమ రిజిస్ట్రేషన్ చేశారు. ఫ్రీ ఆఫ్ కాస్ట్‌తో చేసే రిజిస్ట్రేషన్‌ను ప్రతి ఒక మహిళా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ నాగేంద్ర, ఏపీఎం జయశ్రీ, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో ‘హరిహంసిక’కు పతకాలు

తెనాలి: తెనాలికి చెందిన హరి హంసిక డ్యాన్స్ అండ్ తైక్వాండో ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో పలు బంగారు పతకాలను సాధించారు. ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు లోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో ఆదివారం 7వ జాతీయ స్థాయి సమురాయి, జపాన్ కరాటే, రాష్ట్రస్థాయి సెలభమ్ టోర్నమెంట్ జరిగింది. రోజంతా జరిగిన ఈ పోటీల్లో తెనాలిలోని హరి హంసిక డ్యాన్స్ అండ్ టేక్వాండో ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని విభాగాల్లోనూ ప్రతిభను చాటి 15 బంగారు పతకాలు, అయిదు రజత పతకాలు, మరో అయిదు కాంస్య పతకాలను సాధించారు. పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, టోర్నమెంట్ నిర్వాహకులు కావూరి నరేందర్ రెడ్డి హరిహంసిక విద్యార్థులను అభినందించారు. అలాగే, తెనాలి లో సెలభమ్ కోచింగ్, ఆర్గనైజింగ్ బాధ్యతలను కోచ్ ఎం.చిన్న కేటాయించారు.


పతకాలను సాధించిన విద్యార్థులు

పిల్లల్లో స్వీయ అభివృద్ధికి తోడ్పాటు అందివ్వాలి

జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ శ్రీవాణి


మాట్లాడుతున్న శ్రీవాణి

తెనాలిటౌన్: పిల్లల్లో స్వీయ అభివృద్ధికి తోడ్పాటును అందివ్వాలని జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ డి.శ్రీవాణి పిలుపునిచ్చారు. స్థానిక బోసురోడ్డులోని అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మిషన్ శక్తి డీహెచ్ ఈడబ్ల్యూ సంకల్ప కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న శిక్షణ తరగతులకు సోమవారం జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ శ్రీవాణి హాజరయ్యే మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళల విద్య, వైద్యం, సంక్షేమం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పి.విజయగౌరి వెల్లడించారు. కార్యక్రమంలో డీవీసీ లీగల్ కౌన్సిలర్ కె.పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.సౌజన్య, యామిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు


వైద్యశిబిరానికి వచ్చిన రోగులు

తెనాలిఅర్బన్: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో సుల్తానాబాద్ వడ్డెర కాలనీలో సోమ వారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రక్షిత్ శార్దూల్, డాక్టర్ యేసుబాబులు రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, అందె బాలచంద్రమౌళి, మల్లేశ్వరరావు, వేణుగోపాల్, శ్రీనివాసరావు, హెచ్‌వీలు పి.పద్మావతి, డి.విజయ్‌కుమారి, పాల్గొన్నారు.

దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించండి

తెనాలిఅర్బన్: ఆహార పదార్థాలపై మూతలు ఏర్పాటు చేయడంతో పాటు దుకాణం వద్ద పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు సూచించారు. మారీసుపేట, శివాజీచౌక్‌లలోని పలు స్వీట్ షాప్స్‌ను ఆయన సోమవారం రాత్రి తనిఖీ చేశారు. తినుబండారాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలన్నారు. ప్రజారోగ్యానికి హానీ కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన పలువురు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సరస్వతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై తెనాలి జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్ఐ ఎల్. సరస్వతి కేసు నమోదు చేశారు. ఆమె వెల్లడించిన వివరాల ప్రకారం సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తెనాలి-బాపట్ల రైలు మార్గంలో నిడుబ్రోలు స్టేషన్ సమీపంలో ఉన్నట్లు అందిన సమాచారంతో ఘటన స్థలాన్ని జీఆర్పీ సిబ్బంది పరిశీలించారు. సుమారు 40 సంవత్సరాల వయస్కుడు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం

బాండ్లు అందజేసిన మంత్రి నాదెండ్ల మనోహర్


బీమా బాండ్లను అందజేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిటౌన్: తెల్లవారుజామున నాలు గ్గంటల్నుంచి కష్టించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అలాంటి శ్రామికులకు మెరుగైన ఆరోగ్యం కోసం మున్సిపాలిటీ నుంచి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. పట్టణ కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు తన సొంత ఖర్చుతో చేసిన ప్రమాద బీమా పత్రాలను మంత్రి నాదెండ్ల మనోహర్ అందజేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న 300 పారిశుద్ధ్య కార్మికులకు భరోసా కోసం బీమా కల్పించినట్టు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఆరోగ్య అధికారి డాక్టర్ ఏసుబాబు, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ రాజేంద్రచౌదరి పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

తెనాలి: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పల్లె రోహిత్ శామ్యూల్ అన్నారు. నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యాక తన అనుచరులతో సహా సోమవారం గంగానమ్మ పేటలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. విద్యార్థి సమస్యలపై పోరాటం చేస్తామని ఈ సందర్భంగా రోహిత్ శామ్యూల్ వెల్లడించారు. కార్యక్రమంలో కొల్లిపర విద్యార్థి సంఘం అధ్యక్షుడు దర్శి రవితేజ, తెనాలి మండల విద్యార్థి సంఘం అధ్యక్షుడు అభిషేక్, అద్దంకి సుధాకర్, షాహిద్, సురేంద్ర, పృధ్వి, సంపత్, సుధాకర్, ఎస్.ఉదయ్‌కాంత్, ఎస్.అభి, నిట్ల బాలాజీ, పినపాటి రవికిరణ్, కుర్రా జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గరికపాటి రాజారావు

తెనాలి: ప్రజాచైతన్యం కోసం నాటక కళారూపాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, సినీనిర్మాత డాక్టర్ గరికపాటి రాజారావు చిరస్మరణీయులని అమర కళాకారుల సంస్మరణ సభలో వక్తలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి అమర కళాకారుల సంస్మరణ కార్యక్రమాలను ఆరంభించారు. ‘ఇస్కఫ్’ కార్యాలయంలో సాయంత్రం ఏర్పాటైన సభలో డాక్టర్ రాజారావును స్మరించుకున్నారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ రాజారావు జీవితవిశేషాలను తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన కళాకారిణి బెజ్జం కి నాగమణి మాట్లాడుతూ పార్టీ నిషేధకాలంలో మద్రాస్ వెళ్లిన రాజారావు అక్కడ పుట్టిల్లు సినిమా తీసి ఎందరినో సినీరంగానికి పరిచయం చేసినట్టు చెప్పారు. సభలో రచయిత లక్కరాజు లక్ష్మణరావు, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్, ఇస్కఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు శ్రీదేవి, విజయ, సీపీఐ నాయకుడు బాలస్వామి మాట్లాడారు. తొలుత విప్లవ గేయాలను ఆలపించారు.

మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా కోటయ్య

తెనాలి: వైఎస్సార్ సీపీలో నియోజకవర్గ స్థాయి మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన వార్డు కౌన్సిలర్ ఆవుల కోటయ్య సోమవారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. మున్సిపాలిటీ విభాగానికి సంబంధించి, తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషిచేయాల్సిందిగా తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శివకుమార్ సూచించారు. కార్యక్రమంలో షేక్ జాని, కాలేశ్వర రావు, కొల్లా గురునాధగుప్తా, సుబ్రహ్మణ్యం, పెదలంక వెంకటేశ్వర్లు, రఘురామయ్య, తాడిబోయిన రమేష్, రాము, కుర్రా శ్రీను, కావేటి ఈశ్వరరావు, అక్కిదాసు కిరణ్, వెంకట్, మోహనరెడ్డి, బాబు, ఉదయ్, హనుమాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.